# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వము

పత్రికా ప్రకటన-2 తేది: 12-9-2014

తెలంగాణలో బతుకమ్మ పండుగను ప్రపంచం అబ్బురపడే రీతిలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రకటించారు. సద్దుల బతుకమ్మ రోజు హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ మీద గొప్ప వేడుక జరుగుతుందని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలోనూ పండుగను ఘనంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. కర్ణాటక లోని మైసూర్ లో నిర్వహించే దసరా ఉత్సవాల మాదిరిగా తెలంగాణ బతుకమ్మ పండుగ జరుపుతామని చెప్పారు.

ఈ ఏడాది దుర్గాష్టమి నాడు నిర్వహించే సద్దుల బతుకమ్మ పండుగ ఏర్పాట్లను ముఖ్యమంత్రి సచివాలయంలో శుక్రవారం సమీక్షించారు. తెలంగాణ సాంస్కృతిక వైభవానికి చిహ్నంగా యావత్తు దేశం దృష్టిని ఆకర్శించే విధంగా పండుగ నిర్వహించాలని ముఖ్యమంత్రి అధికారులను కోరారు. బతుకమ్మ పండుగ ఏర్పాట్ల కోసం రూ.10 కోట్లను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు తక్షణం రూ. 10 లక్షల చొప్పున పంపాలని కోరారు. ఈ పండుగకు వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా ముఖ్యమంత్రులు జయలలిత, వసుంధర రాజే, ఆనంద్ బెన్, మమతా బెనర్జీ లతో పాటు లోక్ సభ స్పీకర్ సుమిత్రా మహజన్, కేంద్ర మహిళా మంత్రులను, మహిళా గవర్నర్లను, కిరణ్ బేడి లాంటి ప్రముఖులు, మేధా పాట్కర్ లాంటి ఉద్యమకారులు, అరుంధతి రాయ్ లాంటి మహిళా ప్రముఖలను ఆహ్వానించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. విదేశి మహిళా ప్రముఖురాలిని గౌరవ అతిథిగా కూడా ఆహ్వానిస్తామని చెప్పారు. వారితో స్వయంగా తానే మాట్లాడి ఆహ్వానిస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి తో పాటు మంత్రులు, యంపిలు, ఎమ్మేల్యేలు, ఎమ్మేల్సీల భార్యలు కూడా ఈ వేడుకలో పాల్గొంటారని కేసిఆర్ చెప్పారు. తెలంగాణకు చెందిన మహిళా సివిల్ సర్వీస్ అధికారులు, రాష్ట్ర స్థాయి మహిళా అధికారులు కూడా రాష్ట్ర రాజధానిలో జరిగే ఈ పండుగలో పాల్గొనాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ పై సద్దుల బతుకమ్మ జరుపాలని నిర్ణయించారు. ఎల్ బి స్టేడియంలో బతుకమ్మలను పేర్చుకుని, దాదాపు 25 వేల మంది మహిళలు అక్కడి నుండి ట్యాంక్ బండ్ వరకు ఊరేగింపు జరుపుతారు. ట్యాంక్ బండ్ పైనే పెద్ద వేదిక ఏర్పాటు చేసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖులను అక్కడ కూర్చోబెడతారు. అక్కడే మహిళలు బతుకమ్మలు ఆడతారు. బతుకమ్మ ఊరేగింపులో భాగంగానే మంగళ వాయిద్యాలు, మేళ తాళాలు, తెలంగాణ కళలు ప్రదర్శిస్తారు. దాదాపు 10 వేల బతుకమ్మలను ఎల్.బి. స్టేడియంలో ప్రభుత్వ సహకారంతోనే పేరుస్తారు. అందుకు కావలసిన గునుగు, తంగేడు లాంటి పూలను కూడా తెప్పిస్తారు. మొత్తంగా హైదరాబాద్ లో 25 వేల మంది మహిళలు బతుకమ్మలతో తరలి వెలుతుంటే ఆకాశంలోని హరివిల్లు నేలకు దిగిందా అనే విధంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ తెలంగాణకు ప్రత్యేకమైనదే కాకుండా జీవితంతో ముడిపడి వున్న పండుగ అని, అన్నింటికి మించి తెలంగాణ సెంటిమెంట్ కు బతుకమ్మ పండుగకు అవినాభావ సంబంధం వుందన్నారు. కాబట్టి తెలంగాణ రాష్ట్రంలో ఈ పండుగను అత్యంత ఘనంగా జరుపుకోవాలని చెప్పారు.

బతుకమ్మ పండుగ జరిగే తొమ్మిది రోజుల పాటు హైదరాబాద్ నగరాన్ని, ట్యాంక్ బండ్ ను, హుస్సేన్ సాగర్ పరిసర ప్రాంతాలను శోభాయమానంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. హుస్సేన్ సాగర్ చుట్టూ రంగురంగుల సీరియల్ బల్బులు పెట్టాలని, హుస్సేన్ సాగర్ నీటిలో కూడా లైట్లు ఏర్పాటు చేయాలని, వివిధ రకాల ఫౌంటేన్లు ఏర్పాటు చేయాలని, నగరంలోని చౌరస్తాలన్నింటిలో హోర్డింగులు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సద్దుల బతుకమ్మ రోజు హుస్సేన్ సాగర్ చుట్టూ బతుకమ్మ పాటలు వినిపించే విధంగామైకులు పెట్టాలన్నారు. హైదరాబాద్ తో పాటు అన్ని జిల్లా కేంద్రాలలో కూడా పండుగ గొప్పగా జరగాలని, ఇందుకోసం కలెక్టర్లు చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. చెరువుల వద్ద లైటింగ్, పరిసరాల శుభ్రత, చెరువుకు వెల్లే రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేయాలనిగ్రామ సర్పంచులకు సర్క్యూలర్లు జారీ చేయాలని కూడా ముఖ్యమంత్రి చెప్పారు. పండుగ జరిగే రోజుల్లో అన్ని

దేవాలయాలను సీరియల్ బల్బులతో అలంకరించాలని, ముఖ్య కూడళ్లలో లైట్లతో తయారు చేసే బతుకమ్మలను కూడా ప్రదర్శించాలన్నారు.

ఈసారి ట్యాంక్ బండ్ పై బతుకమ్మ పండుగను నిర్వహించుకోవాలని, వచ్చే ఏడాది నుండి ఈ పండుగ కోసం శాశ్వత ప్రాతిపదికన నెక్లెస్ రోడ్ లో బతుకమ్మ స్క్వేర్ నిర్మించాలని ముఖ్యమంత్రి చెప్పారు. సామాజిక అంతరాలు లేకుండా ప్రజలందరూ ఉమ్మడిగా జరుపుకునే బతుకమ్మ పండుగ నిర్వహణను అన్ని శాఖల అధికారులు ప్రతిష్టాత్మకంగా భావించి సమన్వయంతో నిర్వహించాలన్నారు. చెరువుల వద్ద రేయిలింగ్ ఏర్పాటు చేయాలని, ఈతగాళ్లను అందుబాటులో వుంచాలని, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, అంబులెన్స్ లు సిద్దంగా వుంచాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ పండుగను గొప్పగా జరుపుకోవడంతో పాటు తెలంగాణ సంస్కృతితో సంబంధం వున్నందున పెద్ద ఎత్తున ప్రచారం కూడా నిర్వహించాలని చెప్పారు. ఢిల్లీ తోపాటు తెలంగాణలోని శంషాబాద్ విమానాశ్రయం, రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల వద్ద హోర్డింగ్స్ పెట్టాలని సూచించారు. హైదరాబాద్ లో అసెంబ్లీ లాంటి భవనాలకు కూడా తొమ్మిది రోజుల పాటు లైటింగ్, సీరియల్ బల్బులు ఏర్పాటు చేయాలని సూచించారు. సాంస్కృతిక శాఖ, తెలంగాణ జాగృతితో కలిసి ఈ పండుగను సమన్వయంతో నడిపించాలని చెప్పారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కెవి.రమణాచారి, యంపిలు కల్వకుంట్ల కవిత, జితెందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, డిజిపి అనురాగ్ శర్మ, నగర పోలీస్ కమీషనర్ మహేందర్ రెడ్డి, జిహెచ్ఎంసి కమీషనర్ సోమేష్ కుమార్, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి బిపి. అచార్య, డైరెక్టర్ రాళ్లబండి కవితా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం